సొంతభవనాలు లేక అవస్థలు



మల్దకల్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు, మౌలిక వసతులు లేకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖలో అంగన్‌వాడీ కేంద్రాలది కీలకపాత్ర. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించే ఈ కేంద్రాలు మౌలిక సదుపాలయాల లేమితో అవస్థలు పడుతున్నారు. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్లు ఉన్నా అవి శిథిలావస్థకు చేరుకున్నారు.

అటకెక్కిన 'పెరటి తోటలు'

అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వాటి ఆవరణలో పెరటి తోటలు సాగు చేసి వాటి ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టి కాహారం అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించినా అది అమలు కావడం లేదు. ఉండడానికే భవ నం లేని పరిస్థితుల్లో పెరటి తోటల పెంపకానికి స్థలాలు లేవని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు. మల్దకల్ మండలంలో మొత్తం 59 అంగన్‌వాడీ కేంద్రాలు కాగా.. వాటిలో 3 మినీ అంగన్‌వాడీ కేంద్రా లు ఉన్నాయి. వాటిలో 30 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా.. మిగతావి గ్రామ పంచాయతీ, సామాజిక కమ్యూనిటీ భవనాలలో కొనసాగుతున్నాయి. వాటిలో మొత్తం 2,793మంది చిన్నారులు, 759 మంది గర్భిణులు, బాలింతలు లబ్ధి పొందుతున్నారు. సొంత భవనాలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు, మౌలిక వసతులు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పౌష్టికాహారం నిల్వకు ఇబ్బందులు



మల్దకల్‌లో 6 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 2వ అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనాలు లేక అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం నుంచి వచ్చిన పౌష్టికాహారాన్ని పంపిణీ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనం నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– సుస్మిత, మల్దకల్

అధికారులకు విన్నవించినా..



అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. అద్దె భవనాల్లో సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలకు మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పించాలి. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదు.

– పుష్పలత, అంగన్‌వాడీ టీచర్, మల్దకల్

సమస్య పరిష్కరిస్తాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలంటినీ పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం. నిధులు మంజూరు అయిన వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు ఇప్పటికే నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం. వీలైనంత వేగంగా మౌ లిక వసతులు సమకూర్చుతాం. – కమలాదేవి, సీడీపీఓ

క్లుప్తంగా

పీహెచ్‌సీ సిబ్బందికి సన్మానం



అయిజ: కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బందిని గురువారం 19వ వార్డు కౌన్సిలర్ శేక్షావలి ఆచారి శాలువలు, పూలమాలలతో సత్కరించారు. ఈకార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, ఏఈ గోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దేవరాజు, కాంగ్రెస్ నాయకుడు సాంబశివుడు, బసవరాజు, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఊరేగింపు



అయిజ: మండలంలోని యాపదిన్నెలో గురువారం బీరప్ప స్వామి, కనుకదాసు స్వామి విగ్రహాలను భక్తులు భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో ఊరేగించారు. శుక్రవారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతిష్ఠ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



శాంతినగర్ : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేసేందుకు కృషిచేస్తున్న వారికే మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు తిమ్మారెడ్డి కోరారు. వడ్డేపల్లి మండలపరిధిలోని తనగల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం ప్రచారం నిర్వహించారు. గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. నాయకులు రాజు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు బుచ్చారెడ్డి, దేవేంద్రరెడ్డి, శేషన్న, మక్బూల్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కల పరిశీలన



గట్టు : నర్సరీల్లో నాటిన ప్రతి విత్తనం మొలకెత్తేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చెన్నయ్య సూచించారు. గురువారం ఆరగిద్ద గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. నర్సరీల్లో నీడనిచ్చే ఏర్పాట్లు చేసుకోవలన్నారు. వర్షాకాలం నాటికి వందశాతం మొక్కలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కొత్తగా చేపట్టిన సీసీ రోడ్ల పనులను ఆయన పరిశీలించారు.

కోటి సంతకాల సేకరణ



పెబ్బేరు రూరల్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు బీసీ సామాజిక కులగణన, రిజర్వేషన్ల పెంపు కోసం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మండల బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఘనపురం కృష్ణ, జిల్లా కార్యదర్శి బహుజన రమేష్, ఎంపీటీసీ ఎల్లస్వామి, జిల్లా కోకన్వీనర్ గుడిసె ధర్మ, నాయకులు భాస్కర్, బీసన్న, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

పెబ్బేరు రూరల్: క్రీడలు మానసికోల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని సింగిల్ విండో చైర్మన్ జగన్నాథంనాయుడు అన్నారు. గురువారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాథస్వామి జాతర సందర్భంగా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్‌పీఎల్–10 ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను క్రీడాకారులతో కలిసి ప్రారంభించారు.



'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

గట్టు : కంటివెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి శశికిరణ్, సర్పంచ్ రాణిలు కోరారు. గురువారం బోయలగూడెం గ్రామంలో శిబిరాన్ని ప్రారంభించారు. సల్కాపురం గ్రామంలోనూ కార్య క్రమం కొనసాగుతోంది, రెండు గ్రామాల్లో 247 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యు లు తెలిపారు. 8 మందికి రీడింగ్ గ్లాసులను పంపిణీ చేశామని, మరో 24 మంది కోసం సిఫారసు చేశామన్నారు. వైద్యాధికారులు తిమ్మప్ప, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ /స్వాని వెంకటపతిరాజు అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నెలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన హాజరై ప్రారంభించారు. అంధత్వాన్ని నివారించేందుకే ప్రభుత్వం కంటి వెలుగును ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు.


శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారి, సర్పంచ్

అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు

అమరచింత: మున్సిపాలిటీ అనుమతులకు విరుద్ధంగా అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా హెచ్చరించారు. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో కాళికా ఆలయం సమీపంలో నారాయణ అనే వ్యక్తి కొత్తగా ఇంటి నిర్మాణ పనులు చేస్తూ రహదారిపై మెట్లను నిర్మిస్తున్నాడనే ఫిర్యాదుతో టౌన్ ప్లానర్ సుధాకర్‌తో కలిసి ఇంటి నిర్మాణ పనులను పర్యవేక్షించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తుండటంతో మెట్లను మున్సిపల్ సిబ్బంది ద్వారా తొలగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో కొత్తగా ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించే వ్యక్తులు మున్సిపల్ నుంచి అన్ని అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రహదారిని ఆక్రమించుకోవడం, డ్రైనేజీలపై నిర్మాణాలు చేపట్టరాదన్నారు. పట్టణంలో సీసీ రహదారుల నిర్మాణాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంగ లావణ్య పాల్గొన్నారు.


అక్రమంగా నిర్మించిన మెట్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


ఆత్మకూర్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య అధికారి

ఆత్మకూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు తిప్పుడంపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శరత్ ఆధ్వర్యంలో దగ్గు, జ్వరం, తలనొప్పి, చర్మవ్యాధులు ఉన్న వారిని గుర్తించి మందులు అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని వసతి గృహాలను ప్రతి గురువారం సందర్శించి విద్యార్థులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ ఆనంద్, హెల్త్ సూపర్‌వైజర్లు అయూబ్‌ఖాన్, సురేందర్‌గౌడ్, ఏఎన్ఎం రాజమణి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

వీపనగండ్ల: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించినప్పుడే విద్యలో ఉత్తమంగా రాణించగలుగుతారని మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల బాలికలకు ఆరోగ్య సమస్యలు, సలహాలు అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బాలికలు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలని, చిన్న పాటి సమస్యలు వచ్చినా వైద్యాధికారుల సూచనలు తీసుకోవాలని ఆయన అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఎన్నో సమస్యలను అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌ఓ స్వప్న, పలువురు ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో 174 మంది విద్యార్థులకు మండల వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య అధికారి రాముడు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 34 మంది విద్యార్థులు వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య అధికారి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. వడదెబ్బ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు శ్రీదేవి, ఆశాకార్యకర్తలు భాగ్యమ్మ, కల్పన, జ్యోతి, జానకి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శ్రీరంగాపురం కేజీబీవీలో


వీపనగండ్లలోని కస్తూర్బా విద్యార్థులకు ఆరోగ్యంపై సూచనలిస్తున్న వైద్యాధికారి వంశీకృష్ణ

ప్రమాదంలో జింకకు గాయం



గద్వాల క్రైం: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో జింకకు గాయాలైన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గద్వాల మండలంలోని పరుమాల గ్రామ శివారులో వ్యవసాయ పొలాల నుంచి అకస్మాత్తుగా జింక రోడ్డుపైకి వచ్చింది. ఈ క్రమంలో వేగంగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం జింకను గమనించక ఢీ కొట్టింది. గమనించిన స్థానికులు పంచాయతీ కార్యదర్శి అశ్వినికి సమాచారం అందించారు. దీంతో గాయపడిన జింకను బైక్‌పై తీసుకెళ్లి అటవీశాఖ అధికారులకు అప్పగించగా.. జింకకు పశువైద్యులచే చికిత్స అందించారు. రోడ్డుపై వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



గద్వాల : ఇటీవల మేడ్చల్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో విశ్వభారతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. క్యాడెట్ కేటగిరి విభాగంలో సుప్రీతి, షణ్ముఖీ, సబ్ జూనియర్ విభాగంలో సంజన, అనుజ్ఞలు అత్యుత్తమ ప్రతిభ చాటి బంగారు పతకాలను సాధించారు. మాస్టర్ రాజేశ్వరి దగ్గర వీరు శిక్షణ పొందారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ త్యాగరాజు, ప్రిన్సిపాల్ తిరుమలేష్ అభినందించారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



మానవపాడు: విద్యార్థుల శక్తి సామర్థ్యాలు గుర్తించి ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ ముషాహిదాబేగం అన్నారు. గురువారం మండలంలోని నారాయణపురం ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు విద్య అభ్యాసంపై శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించి బ్యాగుల్లో మట్టిని నింపాలని సూచించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి

పెబ్బేరు: మెడికో విద్యార్థి ప్రీతి మరణంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సిట్టింగ్ జడ్జిచే విచారణ చేపట్టి దోషులకు శిక్షించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థిని ఉన్నత చదువులకు నోచుకోని పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉందని, కాలేజీలు, యూనివర్సిటీల్లో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఆడ పిల్లలకు భద్రతకు ప్రత్యే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓటును నిజాయితీగా వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

శాంతినగర్ : ఓటు వజ్రాయుధం లాంటిదని నిజాయితీగా వినియోగించుకుంటే సరియైన నాయకున్ని ఎన్నుకుంటామని రాష్ట్రం, దేశం బాగుపడుతుందని నడిగడ్డ హక్కుల పోరాటసమితి అధ్యక్షులు గొంగ్లళ్ల రంజిత్‌కుమార్ అన్నారు. పుర పరిధిలోని వడ్డేపల్లి పాలిటెక్నిక్ కళాశాల, శాంతినగర్‌లోని బోధిని కళాశాలల్లో తెలంగాణ క్రాంతిదళ్ ఆధ్వర్యంలో విద్య–ఓటు–విద్యార్థి అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రంజిత్‌కుమార్ హాజరై మాట్లాడారు. నడిగడ్డలో రెండు జీవనదులు పారుతున్నా ఇంకా వెనుకబడే ఉందన్నారు. జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, తెలంగాణ క్రాంతిదళ్ నాయకులు నాగేష్‌యాదవ్, వీరేష్, శివశంకర్, ఎంపీటీసీ, గొంగ్లళ్ల ఆంజనేయులు, కృష్ణ, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయ పునర్నిర్మాణానికి విరాళాలు

గద్వాల : జిల్లా కేంద్రంలోని నల్లకుంట శివాలయ పునర్నిర్మాణం కోసం భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. సుమారు రూ. రెండు కోట్ల రూపాయల వ్యయంతో జరిగే నిర్మాణంలో కాలనీ ప్రజలతో సమీప కాలనీల భక్తులు భాగస్వామ్యం అవుతున్నారు. ఆలయ కమిటీ సభ్యులు దాతల నుంచి విరాళాలను సేకరిస్తున్నారు. శ్రీనివాస కాలనీకి చెందిన గంజ్ వ్యాపారి విజయ్‌కుమార్ తన తండ్రి తిమ్మన్న జ్ఞాపకార్థం రూ.75వేలను విరాళంగా అందజేశారు. మరికొందరూ ఈ సందర్భంగా విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పులిపాటి వెంకటేష్, వెంకట్రాములు, నాగరాజు శెట్టి, కొత్త కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


విరాళాలు అందజేస్తున్న భక్తులు

ఉపాధ్యాయులైన విద్యార్థులు


స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు అధికారులుగా, ఉపాధ్యాయులుగా వివిధ పాత్రలు పోషించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌ఎం రవీంద్ర, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ విజయంపై సంబరాలు

గద్వాల: ఈశాన్య భారతంలోని త్రిపుర, నాగాలాండ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సంచలన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. గురువారం జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన చౌరస్తాలలో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చడంతో పాటు మిఠాయిలు పంపిణీ చేశారు.

ప్రజా విజయానికి సంకేతం

త్రిపుర, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడంపై డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు 2023లో ఖచ్చితంగా తెలంగాణపై ప్రభావం చూపుతాయని చెప్పారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఈశాన్య రాష్ట్రాల ప్రజలు బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంపై నమ్మకం ఉంచి ఇంతటి ఘన విజయాన్ని కట్టబెట్టారన్నారు. కరెంట్, బస్సు, రిజిస్ట్రేషన్ తదితర చార్జీలను పెంచి సామాన్యుల నడ్డివిరిచినపుడు లేని బాధ.. గ్యాస్ ధరలను పెంచినపుడే గుర్తుకు వచ్చిందా అని బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. సమావేశంలో బండల వెంకట్రాములు, నాగేందర్, భాస్కర్‌యాదవ్, రామంజీ, శ్యామ్, గీతారెడ్డి, పాండురెడ్డి, ప్రవీణ్, రంజిత్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


గద్వాలలో బాణసంచా కాల్చుతున్న బీజేపీ నాయకులు

వంట గ్యాస్ ధర తగ్గించాలి

గద్వాల అర్బన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి నర్మద డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశా రు. సిలిండర్‌పై రూ. 50, కమర్షియల్ సిలిండర్‌పై రూ. 350లను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. నిరసనలో ఎమిలమ్మ, లక్ష్మి, షాహిన్, శోభారాణి, సువర్ణ, బీసమ్మ ఉన్నారు.

మానవపాడు: పెంచిన వంటగ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో నరసింహా, ఆంజనేయులు, దుబ్బన్న, అచ్చన్న, మద్దిలేటి, శేఖర్ పాల్గొన్నారు.

అలంపూర్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరను పెంచి పేదలు, సామాన్యులపై ఆర్థికభారం మోపిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు అన్నారు. పట్టణంలోని గాంధీ చౌక్‌లో కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సిలిండర్లతో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసన తక్షణమే గ్యాస్ ధరను పెంచడం అనవాయితీగా మా రిందని విమర్శించారు. కార్పొరేట్‌కు వెన్నదన్నుగా నరేంద్రమోదీ ప్రభుత్వం ఉందన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నరసింహా, కేవీపీఎస్ మండల కార్యదర్శి వెంకటస్వామి, ఆటో యునియన్ నాయకులు ఖలీ ల్, రాముడు, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిరసన చేస్తున్న నాయకులు

నేడు విద్యుత్‌కు అంతరాయం

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో శుక్రవారం విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని సబ్ ఇంజినీర్ అభిలాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున విద్యుత్ లైన్లు మార్చడం కోసం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, పట్టణ ప్రజలు, దుకాణాదారులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.